క్లుప్తంగా

నారాయణరెడ్డికి ఘన నివాళి

వనపర్తి టౌన్: విశ్వంభర కావ్యంతో తెలంగాణ సాహిత్యాన్ని విశ్వవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహనీయుడు కవి సింగిరెడ్డి నారాయణరెడ్డి అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సాహితీవేత్త సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు నారాయణరెడ్డికి జ్ఞానపీఠ, పద్మశ్రీ, పద్మభూషణ్, నంది అవార్డులు లభించాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, నాయకులు దేవన్ననాయుడు, బాలేమియా, రాంబాబు, వెంకటస్వామి, బీచుపల్లి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ రోడ్డు మరమ్మతు చేయించండి



వీపనగండ్ల: ఉమ్మడి మండలంలోని 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు సరైన రోడ్డు వసతి లేకపోవడంతో పలువురు ఇబ్బందులకు గురి అవుతున్నారు. రిజర్వాయర్‌కు అనుసంధానంగా 40 గ్రామాలకు మిషన్ భగీథ ద్వారా తాగునీరు అందించేందుకు అధికారులు ఫిల్టర్ బెడ్లు కూడా నిర్మించారు. మండల కేంద్రంతో పాటు పెబ్బేరు పట్టణం నుంచి రిజర్వాయర్, ఫిల్టర్ బెడ్లకు వెళ్లేందుకు డబుల్ బీటీ రోడ్డును నిర్మిస్తామని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే డబుల్ బీటీ రోడ్డు నిర్మిస్తే అధికారులు, రైతులు, అక్కడ పనిచేసే సిబ్బందికి ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు కోరుతున్నారు.

వై.శాఖాపూర్‌లో వైద్య శిబిరం



పెబ్బేరు రూరల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వై.శాఖాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ చంద్రశేఖర్ వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. అనుమానిత జ్వరాలతో ఉన్న వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి రోజు ఫీవర్ సర్వే నిర్వహించాలని వైద్య ఇబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ తిరుపతయ్య, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్, ఏఎన్ఎం దీవెనమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో బీఆర్‌ఎస్‌దే అధికారం

కేటీదొడ్డి: భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బాసు హనుమంతు నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పాగుంట, వెంకటాపురం, కొండాపురం తదితర గ్రామాల్లో పార్టీ నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో కలిసి కట్టుగా బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకోవాలన్నారు. నడిగడ్డ ప్రజలు అందరూ బీఆర్‌ఎస్ వైపు ఉన్నారని, పార్టీ నేతలకు ఎలాంటి కష్టం వచ్చిన అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మోనేష్, రాజునాయుడు, వీరన్న, నాగరాజు, గోవర్ధన్, నర్సింహులు, డొల్ల గోవిందు, రాజునాయుడు, ప్రహ్లాద్, రవి, స్వామి ఉన్నారు.

తాగు, సాగునీరు అందించండి

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం, వేముకల్ గ్రామాలకు తాగు, సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా సమస్యలపై అధ్యయన యాత్రలో భాగంగా ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించారు. గ్రామంలో సమస్యలను పరిశీలించారు. పక్కనే కృష్ణమ్మ నిండుకుండలా పరవల్లు తొక్కుతున్నా వందల ఎకరాల భూములు బీడు పడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, పారిశుద్ధ్యం సమస్యలు తిష్టవేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హనుమంతు, వెంకటయ్య, దేవమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వెదజల్లే పద్ధతిలో సాగు మేలు



పామిరెడ్డిపల్లి శివారులో వరి విత్తనాలు వెదజల్లుతున్న రైతులు, ఏఈఓ మధు

- వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- కూలీల సమస్యకు పరిష్కారం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోపాల్‌పేట: వరి సాగును వెదజల్లే పద్ధతిలో చేయడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ కొనసాగుతుండడంతో పాటు మండలంలోని కేఎల్‌ఐ కాల్వలకు సాగునీటిని విడుదల చేస్తుండడంతో రైతులు వరి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులు మూస పద్ధతిలో వరిసాగు చేయడం కంటే కొత్త తరహా విధానాలు అయిన వెదజల్లే పద్ధతిని ఎంచుకుంటే కూలీల కొరతను అధిగమించడంతో పాటు పెట్టుబడి ఖర్చును సైతం తగ్గించుకునే అవకాశం ఉందని ఉందని అధికారులు తెలిపారు. ఎకరానికి సుమారు రూ.10వేల వరకు ఆదా అవుతుందన్నారు.

200 ఎకరాల్లో..

గతేడాది వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించడంతో ఉమ్మడి మండలంలో సుమారు 200 ఎకరాలకు పైగా రైతులు వెదజల్లే పద్ధతి ద్వారా వరి పంట సాగుచేసుకున్నారని వ్యవసాయ అధికారులు తెలిపారు. గతేడాది కంటే ఈ విధానంలో సాగు పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

విత్తన గొర్రు పద్ధతి

విత్తన గొర్రు పద్ధతిలో శుద్ధి చేసిన విత్తనాన్ని చదును చేసిన పొలంలో నాగటి సాలు వెనక లేదా గొర్రు, ట్రాక్టర్‌తో విత్తనాలు విత్తుకుంటే అధిక దిగుబడి వస్తుందని అధికారులు తెలిపారు. ఈ సాగు ద్వారా చేను చివరి దశలో నేలవారే అవకాశం కూడా తక్కువగా ఉంటుంది.

వెదజల్లే పద్ధతి ద్వారా..

వెదజల్లే పద్ధతిలో మొదట కరిగెట చేసిన తర్వాత ఎకరానికి పదిహేను కిలోల ధాన్యం 24 గంటలు నానబెడితే చిన్నగా మొలక వస్తుంది. మొలకను కరిగెటలో చల్లిన తర్వాత ఆకులు వచ్చే వరకు నీటిని నిల్వ ఉంచకుండా తడులుగా ఇవ్వాలి. ఈ పద్ధతిలో మొక్క ఎక్కువ ఎత్తు పెరగని రకం ఎంచుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ అధికారుల సూచనలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

కూలీల బెడద తప్పుతుంది



నేను నాలుగేళ్లుగా వెదజల్లే పద్ధతి, డ్రమ్‌సీడర్ పద్ధతుల ద్వారా పంట సాగు చేస్తున్నా. ఈ ఏడాది ఎనిమిది ఎకరాలు వెదజల్లే పద్ధతి, నాలుగు ఎకరాల్లో డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా సాగు చేశాను. పనిభారం తగ్గడంతో పాటు.. ఖర్చు ఆదా అవుతోంది. దీంతో పాటు ముఖ్యంగా కూలీల బెడద తప్పుతుంది. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తున్నా. ఎకరానికి రూ.ఎనిమిది వేలు ఆదా అవుతోంది.

– నిరంజన్‌రావు, గొల్లపల్లి

రైతులకు మేలు



వెదజల్లే పద్ధతి ద్వారా పంటసాగు చేస్తే రైతులకు పని తగ్గుతుంది. దాంతో పాటు ఖర్చు తగ్గడం, దిగుబడి పెరగడం, కూలీల ఇబ్బంది తలెత్తకుండా ఉంటుంది. అలాగే విత్తన గొర్రు పద్ధతి ద్వారా కూడా రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. గతేడాది మండలంలో 200 ఎకరాల వరకు సాగు చేశారు. ఈ ఏడాది మరింత ఎక్కువ మంది రైతులు ఈ పద్ధతి పాటించేలా అవగాహన కల్పిస్తున్నాం.

– అనిల్‌కుమార్, ఏఓ, రేవల్లి

మహిళల భద్రత అందరి బాధ్యత



ప్రాజెక్ట్ వద్ద మహిళల భద్రత చట్టాలపై పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అమరచింత: మహిళల భద్రత అందరి బాధ్యత అని, వారి పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని షీ టీం సభ్యులు తెలిపారు. మండలంలోని జూరాల ప్రాజెక్ట్ వద్ద ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు సోమవారం షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పర్యాటకులు, మహిళలు, విద్యార్థినిలకు వారి భద్రత చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల భద్రత కోసం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలపై ఆన్‌లైన్‌లో అసభ్యకర పోస్టులు పెట్టే సైబర్ నేరగాళ్లపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మహిళలు ఆపద సమయంలో 63039 23211 షీటీమ్ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. కార్యక్రమంలో అమరచింత పోలీస్ సిబ్బంది రాములు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

కేతేపల్లిలో రోడ్డు విస్తరణ జరిగేనా?

- తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు
- బాధితులకు డబుల్‌బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తామని హామీ



కేతేపల్లిలో విస్తరణకు నోచుకోని ఆర్‌అండ్‌బీ రోడ్డు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు రోడ్డు విస్తరణ చేపడతామని అటూ అధికారులు, ఇటూ ప్రజాప్రతినిధులు పలుమార్లు హామీలు ఇస్తున్నా.. అమలుకు నోచుకోకపోవడంతో ప్రతినిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వనపర్తి–కొల్లాపూర్ ప్రధాన రోడ్డు వయా పాన్‌గల్, కేతేపల్లి మీదుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇరుకుగా ఉండటం ఈ రోడ్డు ద్వారా ప్రతినిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మండల కేంద్రంలో విస్తరణ పనులు పూర్తి చేసిన అధికారులు కేతేపల్లిలో పట్టించుకోకపోవడంతో ఎదురుగా వాహనాలు వస్తే మరో వాహనం వెనకకు వెళ్లాల్సి వస్తుంది. ఇబ్బందులు గుర్తించిన అధికారులు రోడ్డు విస్తరణకు పావులు కదిపారు. దీంతో విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లల్లో ప్రాధాన్యత ఇస్తామని గతంలో హామీలు ఇచ్చారు. ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా ఏళ్లు గడుస్తున్నా విస్తరణ పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

సామాజిక స్పృహ అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని తోమాలపల్లిలో రోడ్డు భద్రత, చట్టాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు, వాటి అవశ్యకత, హెచ్ఎచ్ 44 రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్న చిన్న తగాదాలకు క్షణికావేశానికి లోనై తగాదాలకు పోకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాస్‌లుగౌడ్, పోలీస్ సిబ్బంది కృష్ణానాయక్, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, నాయకులు రామన్‌గౌడ్, రంగన్న, ఉమేష్‌గౌడ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకుతో ఆరోగ్యం, ఆనందం



గోరింటాకుతో మహిళలు, చిన్నారులు

వనపర్తిటౌన్: గౌరీ దేవి రుధిరాంశతో వెలసిన గోరింటాకును ఆషాఢమాసంలో పెట్టుకుంటే మహిళలకు ఆరోగ్యం, ఆనందం, సౌభాగ్యం కలుగుతాయని పద్మశాలీ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నపద్మ అన్నారు. ఈ మేరకు సోమవారం గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గోరింటాకులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని, గోరింటాకు పెట్టుకోవడంతో ప్రసవం వల్ల కలిగే బాధలు తగ్గుతాయని తెలిపారు. గోరింటాలకు శరీరంలో అధిక ఉష్ణాన్ని తగ్గించే గుణం ఉందని, ఉష్ణాన్ని బట్టి గోరింటాకు ముదురు, ఆరెంజ్ రంగులో పండుతుందని చెప్పారు. తలకు పట్టించి స్నానం చేస్తే జుట్టు ఆరోగ్యంగా, కండిషనర్‌గా గోరింటాకు పని చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందిమల్ల శారద, గంజి రత్నమ్మ, కంచె భాగ్యమ్మ, సక్కుబాయి, శిరీష, లక్ష్మి, సరిత, శ్రీదేవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

చిన్నిపాడులో ఆవు మృత్యువాత



ఆవు మృతితో రోదిస్తున్న మహిళా రైతు

మానవపాడు: బిడ్డను ఎంత ప్రేమగా పెంచుకుంటుందో అలాగే కొని సంవత్సరాలుగా పెంచుకున్న ఆవు ప్రసవ వేదనతో మృత్యువాత పడడంతో పెంచిన మహిళ కన్నీరుమున్నీరైన ఘటన సోమవారం చెన్నిపాడులో చోటుచేసుకుంది. చెన్నిపాడు గ్రామానికి చెందిన చంద్‌బాషా, నూర్జహాన్ దంపతులు కొంతకాలంగా ఆవులను పెంచుకుంటున్నారు. ఆవులపై ప్రేమతో సొంత బిడ్డలాగే పెంచారు. ఆదివారం రాత్రి ఆవు అస్వస్థతకు గురైంది. మండల కేంద్రంలోని పశువైద్య శిబిరం కంపౌండర్‌కు సమాచారం ఇచ్చారు. ఉదయం వస్తామని కంపౌండర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. దీంతో ఏమి చేయాలో తెలియక రాత్రి మొత్తం దంపతులు నిద్రహారాలు మాని ఆవుకు సేవలు చేశారు. సోమవారం ఉదయం పశువైద్య అధికారి వచ్చి ఆవుకు ప్రసవం చేసేందుకు ప్రయత్నం చేసినా, ఫలించక ఆవు, కడుపులో దూడ మృత్యువాత పడ్డాయి. దీంతో దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. ఆమె రోదన చూసిన ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

పెద్దకొత్తపల్లి: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు చేపట్టేవిధంగా ఎన్డీఏ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 6వ తేదీన చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు వీరబాబు కోరారు. సోమవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు వంగపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో దీక్ష చేపడుతునట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, కురుమూర్తి, మధు, రాము, జంపయ్య, పరమేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని 24 గంటల ఆస్పత్రిగా మార్చాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 24 గంటల ఆస్పత్రిగా మార్చి మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు మండల కేంద్రంలో ఒకే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటం.. వైద్యులు సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే విధులు నిర్వహిస్తుండటంతో అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. గ్రామాల్లో ఉండే ఆరోగ్య ఉప కేంద్రాలు సక్రమంగా తెరుచుకోకపోవడం, సిబ్బంది సరిగా ఉండక వైద్యం కోసం గ్రామీణ, గిరిజన తండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియపర్చిన స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీహెచ్‌సీని 24 గంటల ఆస్పత్రిగా మార్చాలన్నారు.

నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించండి

వీపనగండ్ల: జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి గతంలో ఉన్న నైట్‌హాల్ట్ సర్వీసును వనపర్తి ఆర్టీసీ డిపో అధికారులు రద్దు చేయడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని మాజీ సర్పంచ్‌లు గంగిరెడ్డి, విజయ్‌కుమార్, మానస ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం నుంచి వీపనగండ్ల మండల కేంద్రానికి చివరి ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం 2 గంటలకే ఉందని, ఆ తర్వాత మండల కేంద్రానికి వెళ్లేందుకు వనపర్తి నుంచి బస్సు వసతి లేదని వాపోయారు. గతంలో ఉన్న నైట్‌హాల్ట్ సర్వీసును పునరుద్ధరిస్తే గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, వీపనగండ్ల, సంగినేనిపల్లి, తూంకుంట తదితర గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

బస్సు నిలపాలని డీఎంకు వినతి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం స్టేజీలో వనపర్తి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సును ఆపాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఇక్కడ వివిధ డిపోలకు చెందిన బస్సులు నిలిచేవి. కొంత కాలంగా వనపర్తి డిపో బస్సులు నిలపకపోవడంతో వివిధ గ్రామాల ప్రయాణికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మాజీ సర్పంచ్ మధునాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు వనపర్తి డిపోలో డీఎంను కలిసి వినతి పత్రం అందించారు. దీనికి డీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డీఎం సూచన మేరకు 200 మంది విద్యార్థుల ఉచిత బస్సుపాసుల కోసం రూ.10,000 నగదును డిపో సిబ్బందికి అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

చర్మకుకారులను ఆదుకోవాలి: ఏఐటీయూసీ



మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలో ఏళ్లుగా రోడ్ల పక్కన చెప్పులు కుట్టే వృత్తి (చర్మకార)పై జీవిస్తున్న కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. ఆయన వనపర్తిలోని సీపీఐ కార్యాలయంలో స్నేహ పుట్‌పాత్ వర్కర్స్ సెంటర్‌లో చెప్పులు కుట్టే కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌక్, మున్సిపల్ కాంప్లెక్స్, గాంధీచౌక్, కొత్తబస్టాండ్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఎండ, వానకు కష్టాలు పడుతూ చెప్పులు కుడుతూ పేదరికంలో జీవనం సాగిస్తున్నారు. ఒక్కొక్కరికి రోజు ఆదాయం రూ.వంద కూడా మించడం లేదని వాపోయారు. పనిముట్లు, ముడి సరుకు (చర్మం, లెదర్)కు బ్యాంకుల నుంచి రుణం, నీడ కోసం షెడ్లు నిర్మించాలని కోరారు. చాలా మందికి ఆసరా పింఛన్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, పింఛన్ కల్పించాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో వారి వృత్తి పూర్తిగా దెబ్బతిందని, వారిని ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, శాంతన్న, నజీర్, వెంకటేశ్వర్లు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



కేతేపల్లిలో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 19వ వార్డు గాంధీనగర్‌లో సాతాపురం లక్ష్మమ్మ మృతి చెందిన విషయాన్ని స్థానిక నాయకుడు ఎల్‌ఐసీ కృష్ణ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ సోమవారం లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేఘన్న అభయహస్తం పేరుతో ఎమ్మెల్యే అందించిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ద్యారపోగు వెంకటేష్, తిరుపతి నాయక్, ప్రవీణ్‌సాగర్, వెంకటేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన బక్కన్న అనారోగ్యంతో మృతిచెందడంతో సోమవారం మాజీ జెడ్పీటీసీ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రవికుమార్ గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

అల్విదా.. అల్విదా..



ఆత్మకూర్‌లో కొడిపీర్ల ఊరేగింపు

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధి మసీదులో ప్రతిష్ఠించిన కొడిపీర్ల ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. పది రోజుల పాటు ప్రత్యేక పూజలు, కందూర్లు నిర్వహించి సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని పుర వీధుల గుండా భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. అలాగే సాయంత్రం హుస్సేనీ ఆలం, మౌలాలీ, ఇమామేఖాసీం, ఇమామే జలాలీ పీర్లను గౌస్ సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అలాయ్ బలాయ్, మహిళల బొడ్డెమ్మలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కొడిపీర్ల ఊరేగింపు చూసేందుకు పట్టణంలోని ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం



కానాయపల్లి ప్రాథమిక పాఠశాల భవనం



పై కప్పు పెచ్చులు ఊడి కనబడుతున్న చువ్వలు

కొత్తకోట రూరల్: పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్తున్న ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా పాఠశాలల భవనాలను పునర్నిర్మాణంలో పూర్తిగా విఫలమవుతున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కానాయపల్లి శంకరసముద్రం ముంపు గ్రామం కావడంతో పాఠశాల అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనంపై పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 50మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. పునరావాస కేంద్రంలో పాఠశాల భవనం నిర్మించినప్పటికీ గ్రామస్తులు తమకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని గ్రామాన్ని ఖాళీ చేయడం లేదు. దీంతో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం ఎప్పుడు కూలిపోతుందో, ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ చదువులు వెల్లదీస్తున్నారు.

చిన్నపాటి వర్షం కురిసినా..

కిటికీలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం పడితే చాలు వర్షం నీరంతా తరగతి గదుల్లోకి చేరి పుస్తకాలు తడిసిపోతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలలో ఎటు చూసినా ఊడిన పెచ్చులతో పాటు ఇనుప చువ్వలు బయటకు తేలిన భయంకరమైన దృశ్యాలు కనిపిస్తాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిస్తే భవనం పై పెచ్చులు పడుతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు ముందస్తు చర్యలలో భాగంగా విద్యార్థులకు చెట్ల కింద పాఠాలు బోధిస్తున్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రమాదాలు జరగకముందే ఉన్నతాధికారులు, పాలకులు మేల్కొని శిథిలావస్థకు చేరుకున్న భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేయించాలని, లేకుంటే కొత్త భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం వేడుకుంటున్నారు.